సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం । 3 । ఏప్రిల్ । 2024



సెక్టోరల్ అధికారులు కీలకం

సార్వత్రిక ఎన్నికలను విజయవంతం చేసే బాధ్యత సెక్టోరల్ అధికారులపైన ఉందని కలెక్టర్ విజయ సునీత సూచించారు. IIలో



గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

గ్రామాల్లో గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని వైద్యాధికారులను డీఎంహెచ్‌వో జమాల్‌బాషా ఆదేశించారు. IIలో

రంజాన్ వేళలు

పాడేరు, అరకు

ఇఫ్తార్ (బుధ)	సహర్ (గురు)
6.14	4.33

రంపచోడవరం

ఇఫ్తార్ (బుధ)	సహర్ (గురు)
6.27	4.39

న్యూస్‌రీల్

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

- కలెక్టర్ విజయ సునీత

సాక్షి,పాడేరు: లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పింఛన్ల పంపిణీ చేపట్టాలని కలెక్టర్ ఎం.విజయ సునీత ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ నుంచి డీఆర్‌డీఏ పీడీతో కలిసి ఎంపీడీవోలతో టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనల చేశారు. ఈ నెల 3వ తేదీ ఉదయం బ్యాంకుల నుంచి పింఛను సొమ్ము డ్రా చేసి మధ్యాహ్నం నుంచి పంపిణీ ప్రారంభించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఎంపీడీవోలకు దిశానిర్దేశం చేశారు. ఆయా మండలాల్లో గ్రామాల పరిస్థితిని బట్టి సిబ్బంది ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయడం లేదా ఆయా ప్రాంతాల్లో సచివాలయాలు, ఇతర ప్రభుత్వ భవనాల వద్దకు లబ్ధిదారులను రప్పించి పింఛను అందజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొందని కలెక్టర్ వెల్లడించారు. శత శాతం పింఛను పంపిణీ అయినంత వరకు సచివాలయాల సిబ్బంది ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు అందుబాటులో ఉండాలన్నారు. పింఛనుదారులు సచివాలయానికి ఎప్పుడు రావాలి, ఎవరు పంపిణీ చేస్తారు.. గ్రామాల్లో సచివాలయ సిబ్బంది పర్యటించే సమయాలపై ముందుగానే విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఇంటింటికి వెళ్లి పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని కొంతమంది ఎంపీడీవోలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆమె స్పందిస్తూ ఆథరైజేషన్ ఉన్న వారి ద్వారా మాత్రమే పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. రానున్న మూడు, నాలుగు రోజుల్లో పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

యూ.చీడిపాలెంలో 10 మంది వలంటీర్లు రాజీనామా

- డిజిటల్ అసిస్టెంట్‌కు పత్రాలు అందజేత
- చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆరోపణలు ఎంతో బాధించాయని ఆవేదన

కొయ్యూరు : పేదలకు సేవలు అందిస్తున్న వలంటీర్లపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ చేసిన తప్పుడు ఆరోపణలు వారిని బాధించాయి. దీంతో మనస్తాపానికి గురైన యూ.చీడిపాలెం పంచాయతీకి చెందిన 10 మంది వలంటీర్లు మంగళవారం మూకుమ్మడి రాజీనామాలు చేశారు. వీరంతా గ్రామ సచివాలయానికి వెళ్లి డిజిటల్ అసిస్టెంట్ ఎల్లాజీకి రాజీనామా పత్రాలు అందజేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నామని వారు పేర్కొన్నారు. ప్రతిపక్షాలు తమను లక్ష్యంగా చేసుకుని తరచూ చేస్తున్న విమర్శలు మనోవేదనకు గురి చేశాయని తెలిపారు. వారి చేస్తున్న విమర్శలు కారణంగా మనస్సు చంపుకొని పనిచేయలేక రాజీనామాలు చేశామన్నారు. ఏమీ ఆశించకుండా సేవ చేస్తున్న తమపై నిందలు వేయడం తగదని వారు తెలిపారు. పేదలకు 58 నెలల పాటు వలంటీర్లుగా అందించిన సేవలు ఎంతో సంతృప్తి నిచ్చాయన్నారు. ప్రతీ నెలా ఒకటో తేదీన లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉండేదన్నారు. దీనిపై ఎంపీడీవో సీతయ్య మాట్లాడుతూ పదిమంది వలంటీర్లు రాజీనామా చేశారన్నారు.

రాజవొమ్మంగిలో 40 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు

రాజవొమ్మంగి: భానుడు ప్రతాపానికి జనం అల్లాడిపోయారు. రాజవొమ్మంగిలో మంగళవారం 40 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. చిన్నపిల్లలు, వృద్ధులు వేడిమిని తట్టుకోలేక శీతల పానీయాలను ఆశ్రయించారు. ప్రధాన మార్గాలు నిర్మానుష్యంగా కనిపించాయి.

నమ్ముకుంటే నట్టేట ముంచారు

సీటు ఎలా ఇస్తాం.. రూ.50 కోట్లు చూపించాలని చెప్పాను కదా.... అదేంటి సార్.. పార్టీ కష్టకాలంలో ఉంటే.. మా ఆస్తులన్నీ అమ్మి **క్యాడర్‌ను కాపాడుకుంటూ వచ్చాం కదా.. ఈ సమయంలో** ఇలా మాట్లాడితే ఎలా చెప్పండి. ఇదిగో రూ.20 కోట్లు మాత్రమే ఉన్నాయి. **మీరు కొంచెం సహకరిస్తే.. ఏయ్.. మాటల్లేవ్.. మాట్లాడుకోడాల్లేవ్..** ఓటుకు నోటు ఎలాగో.. సీటుకు కోట్లు అలాగే.. ఇది ఫిక్స్. అసలే పొత్తు **లెక్కలతో ప్రతి సీటుకు డిమాండ్ బాగా పెరిగిపోయింది.** మీలాంటి వాళ్లకు సీటివ్వలేను. తమాషాలు చేయకుండా.. పార్టీకి పనిచేయండి..

ఇవీ.. సీనియర్ నేతలు, పార్టీని భుజస్కంధాలపై మోసిన నాయకులతో చంద్రబాబు నిస్సిగ్గు వ్యాఖ్యలు.



- నోట్ల కట్టలున్న వారికే టికెట్లు కట్టబెట్టారని టీడీపీ నేతల ఆగ్రహం
- పార్టీని నమ్ముకొని పనిచేస్తే బాబు ద్రోహం చేశారని ఆవేదన
- కండువాపై కండువా వేసి పనిచేయలేమంటున్న క్యాడర్
- ప్రతి నియోజకవర్గంలో రగులుతున్న అసంతృప్తి
- కొత్తగా వచ్చిన వారికి టికెట్లు ఇవ్వడంపై పవన్‌పై క్యాడర్‌లో వ్యతిరేకత
- రెండు కత్తులు ఒకే ఒరలో ఇమిడే ప్రసక్తే లేదంటున్న జనసేన వర్గం

సాక్షి, విశాఖపట్నం : నోట్ల కట్టలు చూపించినవారికే టికెట్ కన్ఫార్మ్ చేసిన చంద్రబాబు వైఖరిపై ఆ పార్టీ నేతలు మండిపడుతున్నారు. పార్టీని నమ్ముకుంటూ పనిచేస్తుంటే నోట్ల కట్టలకు సీట్లు అమ్ముకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తోకపార్టీ జనసేనలోనూ ఇదే వైఖరి కనిపిస్తోంది. పదేళ్లు కష్టపడిన వారిని పక్కన పెట్టేసి.. కొత్తగా కండువా కప్పుకున్న వారికి టికెట్ కట్టబెట్టిన పవన్ వ్యవహారంపైనా కేడర్‌లో వ్యతిరేకత మొదలైంది. ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టేసుకొని కండువాపై కండువా వేసుకుంటూ ప్రచారం చేయడం తమ వల్ల కాదంటూ టీడీపీ, జనసేన నాయకులు కుండబద్దలు కొట్టేస్తున్నారు. ఉమ్మడి విశాఖలో ప్రతి నియోజకవర్గంలోనూ ఈ అసమ్మతి కుంపటి రోజురోజుకూ రాజుకుంటోంది. ప్రతి నియోజకవర్గంలోనూ క్యాడర్ మొత్తం చంద్రబాబు, పవన్‌కల్యాణ్ తీరును తూర్పారపడుతున్నారు.

ద్వితీయశ్రేణి నేతలపై నిర్లక్ష్యం

ఉత్తర నియోజకవర్గం గంటా శ్రీనివాస రావు గెలిచిన నాటినుంచి నియోజకవర్గం ముఖం చాటేసిన తర్వాత.. అక్కడి కార్పొరేటర్లు, ద్వితీయశ్రేణి నేతలు పార్టీకి కాపుకాస్తూ వచ్చారు. అయితే ఇక్కడ టికెట్‌ను బీజేపీకి కేటాయించడంతో పార్టీలో ఎదగనీయకుండా అడ్డుకుంటున్నారంటూ టీడీపీ నేతలు మండిపడుతున్నారు.

గంటాకు సీటు అమ్మేశారు

భీమిలి నియోజకవర్గంలో ఆది నుంచి కేడర్‌ను కాపాడుకుంటూ వస్తున్న కోరాడ రాజబాబు, కర్రోతు బంగార్రాజును గతంలో మెచ్చుకున్న చంద్రబాబు.. ఇప్పుడు వారి దగ్గర డబ్బులు లేవంటూ గంటా వైపు మొగ్గు చూపారు. సుమారు రూ.20 కోట్ల వరకూ ఖర్చు చేయగలనని చంద్రబాబుకు చెప్పి.. టికెట్ ఇవ్వాలని కోరాడ కోరినా.. సరిపోవంటూ బాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఈ వర్గాలు బాబు వైఖరిపై మండిపడుతున్నాయి. భీమిలిని నాశనం చేసిన గంటాకు టికెట్ అమ్మేసుకున్నారంటూ టీడీపీ శ్రేణులే బహిరంగంగా ఆరోపణలు చేస్తున్నాయి.

జనసేనతో కోట్లకు బేరం

దక్షిణ నియోజకవర్గంలో టీడీపీ తరపున టికెట్ ఆశిస్తూ క్షేత్ర స్థాయిలో కార్యకర్తలతో మమేకమైన పార్టీ నేతలు డా.విల్లూరి చక్రవర్తి, నజీర్‌కి కూడా చంద్రబాబు మొండిచెయ్యి చూపించారు. పార్టీని నమ్ముకుంటూ వచ్చిన తమను మోసం చేయడం తగదని వేడుకున్నా.. వారి మాటలు వినేందుకు కూడా చంద్రబాబు, లోకేష్ ఇష్టపడలేదని సమాచారం. దీంతో దక్షిణ నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయిస్తూ టీడీపీ అధినేత చంద్రబాబు బేరం కుదుర్చుకున్నాడని విమర్శలు కోడై కూస్తున్నాయి.

బండారుకు జెల్ల

పెందుర్తిలో సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తికీ చంద్రబాబు జెల్ల కొట్టారు. చివరి వరకూ పార్టీ టికెట్ నీదేనంటూ హామీ ఇచ్చిన బాబు.. చివరి నిమిషంలో జనసేనకు కట్టబెట్టడంతో టీడీపీ కేడర్ అసంతృప్తితో రగిలిపోతోంది. బండారుకు బద్ధశత్రువైన పంచకర్ల రమేష్ బాబు వెంట పయనించే ప్రసక్తే లేదని, చంద్రబాబుకు ఇష్టం ఉంటే ఆయనే వచ్చి ప్రచారం చేసుకోవాలే తప్ప.. తాము సహకరించబోమని తెగేసి చెబుతున్నారు.

రూ.50 కోట్లకు సీటు అమ్ముకున్నాడని ప్రచారం

మాడుగుల సీటును మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీజీ కుమార్ సీటు ఆశించారు. వీరిని కాదని ఎన్ఆర్ఐ పైలా ప్రసాదరావుకు టికెట్ కేటాయించారు. రూ.50 కోట్లకు చంద్రబాబు టికెట్‌ను అమ్ముకున్నారన్న ఆరోపణలు టీడీపీ శ్రేణుల నుంచే వినిపిస్తున్నాయి.

డబ్బులు లేవని పక్కన పెట్టేశాడు

యలమంచిలి టికెట్‌ను జనసేనకు అమ్ముకున్నారంటూ టీడీపీ నేతలు మండిపడుతున్నారు. టికెట్ ఆశించిన ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావు వద్ద డబ్బులు లేవన్న సాకుతో టికెట్ లేదని చెప్పడంతో.. వారిని నమ్ముకున్న కేడర్ రగిలిపోతోంది. సోమవారం జరిగిన ఆత్మీయ సమావేశంలోనూ పార్టీ శ్రేణుల మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. జనసేనకు చంద్రబాబు ఇక్కడ టికెట్‌ను అమ్ముకున్నాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నమ్ముకున్నోళ్లకు ఝలక్

అనకాపల్లి నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఆది నుంచి పార్టీలో ఉన్న పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా నాగజగదీష్ టికెట్ ఆశించారు. వీరితో పాటు పూటకో పార్టీ మారే దాడి వీరభద్రరావు కూడా టికెట్ ఆశించి.. టీడీపీలోకి జంప్ అయ్యారు. వీరందరికీ చెక్ చెప్పి.. జనసేనకు టికెట్ కేటాయించడంపై అందరిలోనూ ఒక్కసారిగా ఆగ్రహం కట్టలు తెంచుకుంది. డబ్బులు మూటలకే టికెట్లు కేటాయించారంటూ చంద్రబాబుపై టీడీపీ క్యాడర్ విమర్శిస్తోంది.

'గ్లాసు'లోనూ అసమ్మతి తుపాను

ఇక పార్టీ పెట్టినప్పటి నుంచి చంద్రబాబుతోనే ప్రత్యక్షంగా, పరోక్షంగా పయనిస్తూ.. చెట్టపట్టాలేసుకొని తిరుగుతున్న జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు కూడా.. బాబు లక్షణాలు వంటబట్టాయి. తనని నమ్ముకొని పార్టీలోకి వచ్చిన వారి భవిష్యత్తును గాలిలో దీపం మాదిరిగా వదిలేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా జనసేన శ్రేణులు పవన్ పొత్తు వైఖరిని దుమ్మెత్తి పోస్తున్నారు. టికెట్ ఆశించి పార్టీకి ఏ తాడు బొంగరం లేకపోయినా అన్నీ తామై కోట్లు ఖర్చు చేసిన వారిని ఏమాత్రం పట్టించుకోలేదు. నియోజకవర్గంలో జనసేన కోసం పాటుపడిన వారికి, టికెట్ ఆశించి పార్టీలో చేరిన వారికీ పవన్ ఝలక్ ఇచ్చారు. భీమిలిలో పంచకర్ల సందీప్‌కు టికెట్ ఇస్తానని చెప్పి చివరి నిమిషంలో మోసం చేయడంపై భీమిలి జనసేన వర్గం పవన్ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. దక్షిణంలో టికెట్ ఇస్తామన్న హామీతో గ్లాసు పట్టుకున్న కార్పొరేటర్లు కందుల నాగరాజు, సాదిక్.. పవన్‌ను నమ్ముకొని రోడ్డున పడ్డారు. ఉత్తర నియోజకవర్గంలో పసుపులేటి ఉషాకిరణ్‌కీ పవన్ వెన్నుపోటు పొడిచారు. గాజువాక టికెట్ ఆశించి పార్టీ కోసం రూ.కోట్లు ఖర్చు చేసిన సుందరపు సతీష్‌ని కరివేపాకులా తీసిపారేశారు. అనకాపల్లిలో పరుచూరి భాస్కరరావు పవన్ హ్యాండిచ్చారు. పాయకరావుపేటలో టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనితకు సీటు ఇవ్వొద్దని జనసేన నేత గెడ్డం బుజ్జి అభ్యర్థన కూడా పవన్ కల్యాణ్ పరిగణలోకి తీసుకోలేదు. ఇలా కూటమి పేరుతో టికెట్లు అమ్ముకున్నారంటూ జనసేన శ్రేణులు కూడా దుమ్మెత్తి పోస్తున్నాయి.

మన్యంలో మాయాజాలం

పాడేరులో టికెట్ కోసం పోటీపడిన గిడ్డి ఈశ్వరి, మణికుమారిని కాదని.. డబ్బులు దండిగా ఉన్నాయన్న లెక్కలతో కిల్లు రమేష్‌నాయుడుకు చంద్రబాబు టికెట్ కేటాయించారు. దీంతో మిగిలిన రెండు వర్గాలూ.. ఇది మూమ్మాటికీ నోటుకు సీటు అంటూ చెబుతున్నారు. టికెట్ కోసం పోరాటం చేస్తాం తప్ప.. కూటమి వెంట నడిచే సమస్యే లేదంటున్నారు. టికెట్లు అమ్ముకుంటే పార్టీ కోసం పనిచేసేవారి పరిస్థితి ఏంటో చంద్రబాబు చెప్పాలని ప్రశ్నిస్తున్నారు.

అరకులో అదే తీరు

అరకులో పర్యటించిన సమయంలో దొన్నుదొర అభ్యర్థి అంటూ చంద్రబాబు స్వయంగా ప్రకటించారు. అయితే పార్టీ టికెట్ ఆశించిన కిడారి శ్రావణ్, అబ్రహంను కూడా పక్కకు నెట్టేశారు. అరకులో అంతగా ప్రభావంలేని బీజేపీకి చెందిన పాంగి రాజారావుకి టికెట్ ఇవ్వడం వెనుక రూ.కోట్లు చేతులు మారాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే అబ్రహం రెబల్‌గా పోటీ చేస్తానని ప్రకటించగా.. దొన్నుదొర, శ్రావణ్ వర్గాలు మాత్రం చంద్రబాబు వైఖరిని తప్పుపడితూ.. కూటమికి సహకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశాయి.

సీలేరు జల విద్యుత్ కేంద్రం మరో ఘనత

- వంద శాతం విద్యుత్ లభ్యత, సామర్థ్యం సూచిక సాధన
- సమష్టి విజయం: కాంప్లెక్స్ చీఫ్ ఇంజినీర్ శ్రీధర్

సీలేరు : స్థానిక జల విద్యుత్ కేంద్రం మరో సారి ఘనత సాధించింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో వంద శాతం విద్యుత్ లభ్యత, సామర్థ్య సూచిక సాధించి మరో రికార్డును సృష్టించింది. ఈ కేంద్రాన్ని 1964లో నిర్మించారు. నాలుగు యూనిట్ల ద్వారా 280 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధిస్తోంది. ఈ ఏడాది విద్యుత్ లభ్యత, సామర్థ్య సూచిక వంద శాతం సాధించిన నేపథ్యంలో మంగళవారం స్థానిక జల విద్యుత్ కేంద్రంలో విజయోత్సవ సభను నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కాంప్లెక్స్ చీఫ్ ఇంజినీర్ శ్రీధర్ మాట్లాడుతూ ఏటా ఈ విద్యుత్ కేంద్రం నూరుశాతం లక్ష్యాలను సాధిస్తుందన్నారు.

ఈ విజయంలో కార్మికులు కూడా భాగస్వాములని ఆయన పేర్కొన్నారు. గతేడాది 97.5 శాతం విద్యుత్ లభ్యత సాధించిందన్నారు. ఈ ఏడాది నూరు శాతం సాధించాలన్న లక్ష్యంతో ఎప్పటికప్పుడు లోడ్, డిశ్చార్జి సెంటర్ల సహకారంతో గొప్ప విజయాన్ని సాధించగలిగామన్నారు. ఈ సంబరాల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లక్ష్మీనారాయణ, ఎస్ఈ వెంకటేశ్వరరావు, ప్రశాంత్‌కుమార్, ఏడీలు శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.



ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు కేక్ తినిపిస్తున్న చీఫ్ ఇంజినీర్ శ్రీధర్

ఆర్ఐటీఐలో జాబ్‌మేళా రేపు

అరకులోయ టౌన్: స్థానిక ఆర్ ఐటీఐలో ఈనెల 4వతేదీ గురువారం ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డి. వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. తమిళనాడుకు చెందిన ఎల్అండ్‌టీ కంపెనీ నిర్వహించే ఈ జాబ్‌మేళాలో ఐటీఐఈ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, వెల్డర్ ట్రేడ్‌ల్లో ఉత్తీర్ణులైన వారితోపాటు టెన్త్, ఇంటర్ పాసైన వారు కూడా అర్హులన్నారు. ఎలక్ట్రీషియన్ 200, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, వెల్డర్ ట్రేడులకు 100 పోస్టుల చొప్పున 300 పోస్టులు, టెన్త్, ఇంటర్ ఉత్తీర్ణులైన వారకిఇ వంట పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. వయసు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య కలిగి, 155 సెంటీమీటర్ల ఎత్తు, 45 కిలోల బరువు ఉన్న వారు విద్యార్హత ధ్రువపత్రాలకు హాజరు కావాలని కోరారు. శిక్షణ సమయంలో రూ.18 వేల వేతనం, ఉచిత భోజనం, షూష్ అందిస్తామన్నారు. శిక్షణ అనంతరం 100 శాతం ఉద్యోగం కల్పిస్తారన్నారు.

ఓటు హక్కు వినియోగంపై నేడు అవగాహన కార్యక్రమాలు

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రం పాడేరులో ఈ నెల 3వ తేదీ బుధవారం పాడేరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన, చైతన్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయ సునీత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9గంటలకు ఈ కార్యక్రమం మొదలవుతుందన్నారు. ఓటరు చైతన్యానికి దోహదపడే వీడియో పాటలు, ఫొటో షూట్ ఫ్రేం, పీవీటీజీల ఓటింగ్‌పై ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్వోలు, జిల్లా, మండల స్థాయి అధికారులు, అధిక సంఖ్యలో ఓటర్లు హాజరు కావాలని ఆమె సూచించారు.

చంద్రబాబుకు మా ఉసురు తగులుతుంది



మండల కేంద్రం వై.రామవరం గ్రామానికి చెందిన నాపేరు గండేపల్లి సత్తిబాబు. నేను పుట్టుకతోనే దివ్యాంగుడను. రెండుకాళ్లు పనిచేయవు. అయినవారు ఎవ్వరూలేని అనాధను. చేతికర్ర సాయంతో కొంత దూరం మాత్రమే నడువ గలను. గత ప్రభుత్వాల హయాంలో పింఛన్లు సక్రమంగా అందేవి కావు. ముఖ్యమంత్రి జగనన్న నియమించిన వలంటీర్ ప్రతినెలా ఒకటో తేదీన ఇంటి వద్దకు ఇచ్చి పింఛను ఇచ్చేవారు. అటువంటి వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు బురద చల్లడం సరికాదు. నేను ప్రభుత్వం ఇస్తున్న పింఛను రూ.3 వేలతో జీవనం సాగిస్తున్నా. ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామ సచివాలయానికి వెళ్లి పింఛను తీసుకోవడం చాలా కష్టం. మాలాంటి వారి కష్టాలు తెలిసి కూడా చంద్రబాబు అలా వ్యవహరించడం సరికాదు. మా ఉసురు తప్పనిసరిగా తగులుతుంది.

ఇంటి దగ్గరే పింఛను ఇప్పించండి




కొయ్యూరు మండలం కొయ్యూరు గ్రామానికి చెందిన నా పేరు పిట్టల వీర్రాజు. వయసు 70 సంవత్సరాలు. వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా మంచానికి పరిమితమయ్యాను. ఇద్దరు సాయం పడితేనే గాని మంచం మీద నుంచి లేవలేను. గత నెల వరకు వలంటీర్ ఇంటికి వచ్చి పింఛను ఇచ్చేవారు. రెండు రోజులైనా పింఛను అందలేదు. వలంటీర్‌ను అడిగితే గ్రామ సచివాలయానికి వెళ్లి తీసుకోవాలని చెప్పారు. లేవలేని స్థితిలో ఉన్న నేను గ్రామ సచివాలయానికి ఎలా వెళ్లేది. ఎండతో పింఛనుదారులు, వారి కుటుంబ సభ్యులు బాధపడతారో టీడీపీ నేతలు ఆలోచించకపోవడం బాధాకరం. మాలాంటి వాళ్లకు ఇంటి వద్ద పింఛను అందేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలి.

పింఛనుదారుల్లో దిగులు

- రెండో తేదీ వచ్చినా నగదు అందకపోవడంతో ఆందోళన
- గ్రామసచివాలయాలకు వెళ్లి తీసుకోవడం కష్టమని ఆవేదన
- చంద్రబాబు కుట్ర రాజకీయాలపై ఆగ్రహం
- ఇంటి వద్దే పింఛను అందేలా చర్యలు తీసుకోవాలని వినతి

చింతూరు/వై.రామవరం/కొయ్యూరు/చింతపల్లి రూరల్: ప్రతినెలా ఒకటో తేదీన పింఛను ఠంచన్‌గా పొందే అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువుల్లో ఆందోళన నెలకొంది. వీరి ఇళ్లకు వెళ్లి పింఛను అందజేసే వలంటీర్లను సేవల నుంచి తప్పించేందుకు కుట్ర పన్నిన చంద్రబాబు తీరుపై వారు మండిపడుతున్నారు. ఇదెక్కడి కుట్ర రాజకీయాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతినెలా ఒకటో తేదీ వచ్చేసరికి ఇంటికి తీసుకువచ్చి పింఛను ఇచ్చేవారని చంద్రబాబు కారణంగా ఈనెల రెండో తేదీ వచ్చినా అందలేదని వారు ధ్వజమెత్తుతున్నారు. సచివాలయాలకు వెళ్లి తీసుకోవడం కష్టమని వారు వాపోతున్నారు. నెలవారీ ఖర్చులలో భాగంగా మందులు, నిత్యావసర సరకులు కొనుక్కునేందుకు వీల్లేకుండా పోయిందని దిగులు చెందుతున్నారు. ఇంటివద్దే పింఛను అందేలా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పింఛను అందితేనే మందులు



చింతూరు మండలం ఎర్రంపేట గ్రామానికి చెందిన నా పేరు పాంద్రు ముత్తయ్య. నేను నాలుగేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నా. స్థానిక ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నా. ప్రభుత్వం ప్రతినెలా రూ.10 వేల పింఛను వలంటీరు ద్వారా అందజేస్తోంది. ఈ మొత్తంలో రూ.5 వేలతో ప్రతినెలా ఒకటో తేదీన చికిత్సకు అవసరమైన ఇంజక్షన్లు విజయవాడ నుంచి, ఇతర మందులను స్థానికంగా కొనుక్కుంటాను. రాజకీయ లబ్ధికోసం ప్రతిపక్షాలు అడ్డుకోవడంతో ఈనెల పింఛను ఆలస్యంగా వస్తుందని టీవీల్లో చూశా. దీంతో ఈనెల మందుల పరిస్థితిపై ఆందోళనగా ఉంది. నడవలేని స్థితిలో ఉన్న నేను రెండు కిలోమీటర్ల దూరంలోని సచివాలయంకు వెళ్లి పింఛను ఎలా తీసుకోవాలి. మా బాధలు ప్రతిపక్షాలకు తెలిసి కూడా వలంటీర్ల సేవలను అడ్డుకోవడం సరికాదు.

పింఛను పొందేదెలా..?



నా పేరు కొమర్తి లక్ష్మణరావు. చింతపల్లి మండలంలోని మైలకూలి వీధి స్వగ్రామం. పుట్టుకతోనే దివ్యాంగుడను. గత నెల వరకు ఇంటి వద్దకు రూ.3 వేల పింఛను తీసుకువచ్చి వలంటీర్ అందజేసేవారు. ఇప్పుడు చంద్రబాబు రాద్ధాంతం చేయడం వల్ల ఒకటో తేదీ అందాల్సిన పింఛను ఇప్పటివరకు ఇవ్వలేదు. ఎక్కడికి కదలాలన్న కర్ర సాయం లేదా మరో వ్యక్తి సాయం ఉండాలి. ఈ పరిస్థితుల్లో గ్రామసచివాలయానికి వెళ్లలేని పరిస్థితి. ప్రభుత్వం ఇంటి వద్దే అందజేసేలా చర్యలు తీసుకోవాలి.

అంధుడను.. ఎలా వెళ్లేది?



చింతూరు మండలం మామిళ్లగూడెం గ్రామానికి చెందిన నా పేరు నాపేరు ముచ్చిక తిరుపతిరావు. అంధుడైన నేను ప్రతినెలా రూ.3వేల పింఛను పొందుతున్నా. గత నెల వరకు ఒకటో తేదీన ఇంటివద్దకు వచ్చి వలంటీరు ఇచ్చేది. ఇప్పుడు రెండో తేదీ వచ్చినా వలంటీర్ రాలేదు. ఆమెను అడిగితే ఈనెల ఇంటి దగ్గరకు వచ్చి పింఛను ఇవ్వడం కుదరదని, సచివాలయం వద్దకు వెళితే అక్కడి సిబ్బంది ఇస్తారని చెప్పింది. అంధుడైన నేను పింఛను కోసం సచివాలయానికి ఎలా వెళ్లాలి. అక్కడకు వెళ్లినా సమయానికి పింఛను ఇస్తారో, లేదో తెలియదు. రాజకీయ లబ్ధి కోసం సామాన్య ప్రజలను ప్రతిపక్షాలు ఇబ్బందులు పెట్టడం దారుణం.

మందులు ఎలా కొనుక్కొనేది?



చింతూరు మండలం కుమ్మూరు పంచాయతీ మామిళ్లగూడెంకు చెందిన నాపేరు శ్యామల ప్రసాద్. గత ఎనిమిది నెలలుగా కిడ్నీవ్యాధితో బాధపడుతూ చింతూరు ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నా. నాకు గత ఐదు నెలలుగా రూ.10 వేల పింఛను వస్తోంది. ఆ డబ్బులతో ప్రతినెలా మందులు కొనుక్కొంటున్నా. ఈనెల వలంటీరు ఇంకా పింఛను ఇవ్వలేదు. ఎందుకని అడిగితే ఎన్నికలు కాబట్టి మమ్మల్ని పింఛన్లు పంపిణీ చేయవద్దని చెప్పారని, ఈ రెండు నెలలు సచివాలయం వద్దనే పింఛను ఇస్తారని చెప్పింది. నడిచే ఓపికలేని నేను పింఛను కోసం సచివాలయానికి వెళ్లి ఇబ్బందులు పడలేను. ప్రతినెలా మాదిరిగానే పింఛను ఇంటికి తెచ్చి ఇస్తేనే బాగుంటుంది.

క్లుప్తంగా

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

• డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

ముంచంగిపుట్టు: గ్రామాల్లో గర్భిణుల ఆరోగ్యం పట్ల వైద్యాధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా ఆదేశించారు. మంగళవారం ఆయన లబ్బూరు పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పీహెచ్‌సీలో జరుగుతున్న ఆశా డే సమావేశంలో ఆయన ఆశా కార్యకర్తల పని తీరుపై సమీక్షించారు. వారి రికార్డులను పరిశీలించారు. అనంతరం మాతా శిశు ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే మలేరియా, ఎపిడమిక్ సీజన్‌ను ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉండాలన్నారు. బాగా పనిచేస్తున్నారని సిబ్బందిని అభినందించారు. వైద్యాధికారి ప్రతాప్ పాల్గొన్నారు.

వచ్చే నెల ఒకటి నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

పాడేరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో మే 1వ తేది నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎ. జగన్‌మోహన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామీణ, మేజర్ పంచాయతీలు, మండల, జిల్లా కేంద్రాల్లో పలు క్రీడాంశాలపై 50 ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. వీటికి గాను ఆయా ప్రాంతాలకు చెందిన క్రీడా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాయమోపాధ్యాయులు, కోచ్‌లు, అంతర్జాతీయ, భారత క్రీడాకారులు, సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 5వ తేదీలోగా పాడేరులోని క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయాల్లో దరఖాస్తులను అందజేయాలని కోరారు. మరిన్ని పూర్తి వివరాలకు 9000274225 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

విజయమే మనందరి లక్ష్యం



శరత్‌నగర్ గ్రామంలో మద్దతు తెలుపుతున్న గిరిజనులతో అరకు ఎమ్మెల్యే పాల్గుణ, తదితరులు



దేవరమడుగులు గ్రామంలోని సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంతబాబు

డుంబ్రిగుడ (అరకులోయటౌన్): వైఎస్సార్‌సీపీ విజయమే మనందరి లక్ష్యమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని కురిడి పంచాయతీ శరత్‌నగర్‌లో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులను జగనన్న ప్రభుత్వం మంజూరు చేసి రహదారులు, వంతెనలతో పాటు

సచివాయాలు, ఆర్‌బికేలు, వెల్‌నెస్ సెంటర్లు వంటివి నిర్మించి ప్రజల కష్టాలు తీర్చారన్నారు. రాష్ట్ర ప్రజలకు బటన్ నొక్కి సంక్షేమ పథకాలు అందించిన జగనన్న కోసం రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అరకులోయ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులైన డాక్టర్ గుమ్మ తనూజరాణి, రేగం మత్స్యలింగంకు ఫ్యాన్ గుర్తుపై రెండు సార్లు బటన్ నొక్కి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. మండల పార్టీ అధ్యక్షుడు చిక్కుడు మలేశ్వరరావు ఆద్వర్యంలో కురిడి పంచాయతీ గోరాపూర్, గొడ్డిగుడ,పిత మారిగుడ గ్రామాల్లో బూత్ సిద్దం-మేము సిద్దం కార్యక్రమం నిర్వహించారు.

వై.రామవరం: జరగబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించి, మరోసారి జగనన్నను ముఖ్యమంత్రినిచేసి, మరింత అభివృద్ధిని సాధిద్దామని ఎమ్మెల్సీ అనంతబాబు అన్నారు. మండలంలో దేవరమడుగులు, గొడుగురాయి, చవిటిదిబ్బలు, తోటకూరపాలెం. పనసలపాలెం, రాచపాలెం, పి.యర్రగొండ, వై.రామవరం, చింతకర్రపాలెం, జాజిగడ్డ, యార్లగడ్డ గ్రామాల్లో ఆయన మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ముఖ్యమంత్రి జగనన్న ఆశిస్సులతో, ఎన్నికల ప్రచార ప్రక్రియను ప్రారంభించామన్నారు. చంద్రబాబు బూటకపు హామీలను నమ్మి ఎవరూ మోసపోవద్దన్నారు. చంద్రబాబుది ధనికులకు అనుకూలమైన ప్రభుత్వమని, జగనన్నది పేదప్రజల ప్రభుత్వమని అన్నారు. చంద్రబాబు గతంలో ఎన్నికల హామీలు ఇచ్చి, ప్రజలను మోసగించారని చంద్రబాబు మోసాలను ఎండగట్టారు. చంద్రబాబు ప్రభుత్వంలో పింఛన్ మంజూరు చేయాలంటే నాయకులకు, అధికారులకు డబ్బులు ఇవ్వాల్సి వచ్చేదని, పింఛన్ వచ్చినా కూడా కొంత సొమ్ము లబ్ధిదారులకు ఇచ్చి, సగం సొమ్మును కాజేసేవారని గుర్తు చేశారు.చంద్రబాబు పాలనలో పాలకులు, జన్మభూమి కమటీలు పథకాల పేరుతో ప్రజాధనాన్ని దోచుకున్నారన్నారు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం సచివాలయ, వలంటీరు వ్యవస్థ ద్వారా నేరుగా ఇంటికి వెళ్లి లబ్ధిదారునికి పింఛన్ అందజేస్తున్నారన్నారు.

జగనన్న ప్రభుత్వ హయాంలో మండలానికి లబ్ధి చేకూర్చిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని వివరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న నాగులపల్లి ధనలక్ష్మీను, అరుకు పార్లమెంటరీ నియోజకవర్గం ఎంపీగా పోటీ చేస్తున్న డాక్టర్ గుమ్మ తనూజరాణీలను తమ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్సీ అనంతబాబు కోరారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు ముర్ల జోగిరెడ్డి, వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, మాజీ ఎంపీటీసీ గుడ్ల హేమామణి, సర్పంచ్‌లు, నాయకులు గుడ్ల త్రిమూర్తులు, మద్దికొండ భారతిబాబు, బచ్చలి రమేష్, కరణం కనకరాజు, వెదుళ్ళ తిరుపతిరెడ్డి, ముత్యాల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

‘రంప’లో టీడీపీ నేతల ఆందోళన

పార్టీ అభ్యర్థిని మార్పు చేయాలని డిమాండ్



రంపచోడదరంలో ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు

రంపచోడవరం: రంపచోడవరం అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిని మార్పు చేయాలని కోరుతూ టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వీరు పార్టీ జెండాలతో రంపచోడవరంలో మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ఇంటి వద్ద ఆందోళన చేపట్టారు. పార్టీకోసం పనిచేసిన వారికి అధిష్టానం అవకాశం కల్పించాలని కోరారు. ప్రస్తుతం ప్రకటించిన టీడీపీ అభ్యర్థి మిరియాల శిరీషను మార్పు చేయాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

సీఎంగా జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు

వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు



ఎన్నికల ప్రచారం చేస్తున్న పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు : రాష్ట్ర భవిష్యత్తుకోసం వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించి ముఖ్యమంత్రిగా జగనన్నను మరోసారి చేయాలని ఆ పార్టీ పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మండలంలోని మారుమూల ఐనాడ, సలుగు, దేవాపురం పంచాయతీల పరిధిలోని దేవాపురం, పులుసుమామిడి, ఈదులపాలెం, సలుగు, కక్కి, లోలంగిపాడు, ఐనాడ, పూతిక గరువు, పెద్దపాలం, రంగసింగిపాడు గ్రామాల్లో నియోకవర్గ పార్టీ పరిశీలకుడు కాకర్లపూడి శ్రీకాంత్ రాజుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ వైఎస్సార్‌సీపీ పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయితేనే రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి ఒక్క గిరిజనుడు తమవంతు కృషి చేయాలన్నారు. ఆయన ప్రచారానికి విశేష స్పందన లభిస్తోంది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, వైస్ ఎంపీపీ కనకాలమ్మ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంగ్లన్నదొర, ఏఎంసీ చైర్మన్ సూరిబాబు, పీఏసీఎస్ చైర్మన్ రామ సత్యవతి, ఎంపీటీసీలు మీనా, ఎర్రయమ్మ, విజయలక్ష్మి, చిట్టమ్మ, సన్యాసయ్య, రామకృష్ణపాత్రుడు, సర్పంచ్‌లు అప్పలకొండ, పరమేశ్వరి, భీమలమ్మ, రాంబాబు, చిట్టిబాబు, బసవన్నదొర, సన్నిబాబు పాల్గొన్నారు.

సెక్టోరల్ అధికారులు కీలకం

కలెక్టర్ విజయ సునీత

సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికలను విజయవంతం చేసే బాధ్యత సెక్టోరల్ అధికారులపైనే ఉందని కలెక్టర్ ఎం.విజయ సునీతసూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అరకు నియోజకవర్గం సెక్టార్ అధికారులకు నియోజకవర్గం స్థాయి మాస్టర్ ట్రైనీలకు పోలింగ్ ప్రక్రియ,ఈవీఎంలు ఏర్పాటు, సెక్టోరల్ అధికారుల బాధ్యతలు, ఎన్నికల విధులపై మంగళవారం మూడవ విడత శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ ముందు,తర్వాత నిర్వహించాల్సిన ప్రక్రియలో సెక్టోరల్ అధికారులు సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. పోలింగ్ రోజు ఈవీఎంల నిర్వహణ, అనంతరం ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు చేరవేయాల్సిన బాధ్యతలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సెక్టోరల్ అధికారి పరిధిలో ఎనిమిది పోలింగ్ కేంద్రాలు ఉంటాయని, వీటి రూట్‌లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పాడేరు అసెంబ్లీ ఆరర్వో,జాయింట్ కలెక్టర్ భావన, అరకు ఆర్వో, ఐటీడీఏ పీవో అభిషేక్, డీఆరర్వో పద్మావతి, ఇతర అధికారులు వీవీఎస్ శర్మ, పి.అంబేద్కర్ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

హుకుంపేట: మండల కేంద్రంలో మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా గుత్తుం పంచాయతీ జి.బొడ్డాపుట్టు గ్రామానికి చెందిన సోభ రాంబాబు అనే వ్యక్తి అక్రమంగా 40 మద్యం బాటిళ్ల తరలిస్తుండగా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సతీష్ చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామల్లో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయించినా, ఎన్నికల నిబంధనలు అతిక్రమించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఐదేళ్లలో సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకు లబ్ధి



తిమ్మాపురంలో మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

అడ్డతీగల: గడిచిన ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సిఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకు లబ్ధి చేకూర్చిందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు.అడ్డతీగల మండలం కిమ్మూరు, పులిగోగులపాడు, గొంటువానిపాలెం, తిమ్మాపురం పంచాయతీల్లో మంగళవారం పార్టీ శ్రేణులతో కలసి ఎమ్మెల్యే ధనలక్ష్మి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఈ ఐదేళ్లలో ప్రతి కుటుంబానికి కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా అమలు చేసిన సంక్షేమ పథకాల వల్ల ప్రతి కుటుంబానికి రూ.1 లక్ష నుంచి రూ.3 లక్షల వరకూ ప్రయోజనం కలిగిందన్నారు. గ్రామాల్లో తాగునీరు, రోడ్లు నిర్మాణాలు, పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపర్చి ప్రజావసరాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీర్చారన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి కార్యాలయాల నిర్వహణకు శాశ్వత భవనాలు నిర్మించి పాలనను ముంగిటకు తీసుకొచ్చారన్నారు. సచివాలయ వ్యవస్థ వల్ల ప్రజలకు ఏమైనా పనుల కోసం మండల కేంద్రాల్లోని కార్యాలయాలకు కాళ్లరిగేలా తిరిగే అవస్థలు తప్పాయన్నారు.పెన్షన్‌లు కూడా ఇంటింటికీ వచ్చి లబ్ధిదారులకు అందించే వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన సాగించిన జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని మరోసారి సంక్షేమ సర్కారుని తెచ్చుకోవాల్సిన చారిత్రిక అవసరాన్ని ప్రజలు గుర్తెరిగి రాభోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై అమూల్యమైన రెండు ఓట్లను వేసి గెలిపించాలని ఓట్లు అభ్యర్ధించారు.ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ మద్దాల వీర్రాజు, వైస్ ఎంపీపీలు కరణం వీరవెంకటరమణ, బాలసుబ్రహ్మణ్యం, జేసీఎస్ కన్వీనర్ నక్కా మోహన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ నేతల చేరిక



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు స్వామి



టీడీపీ నేతలకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అనంతగిరి: మండలంలోని లంగుపర్తి పంచాయతీ దిగువపట్టి, ఎగువపట్టి గ్రామాల్లో టీడీపీకి చెందిన పట్టబోయిన బాబూరావు, పుట్టబోయిన లచ్చన్నతోపాటు 80 కుటుంబాల గిరిజనులు వైఎస్సార్‌సీపీలో చేరారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి దిగువపట్టి, ఎగువపట్టి, చీడివలస, దింసలవలస, కుంభర్తి గ్రామాల్లో మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆయనతోపాటు వైస్ ఎంపీపీ దూరు జయవర్ధిని పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ విజయానికి అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు జన్ని సన్యాసిరావు, సెంబీ సన్యాసిరావు, మాజీ జడ్పీటీసీ దూరు గంగన్నదొర, జేసీఎస్ కన్వీనర్ నవీన్, ప్రధాన కార్యదర్శి డానియేలు, ఉపాధ్యక్షుడు కొర్రా సూర్యానారాయణ, పీఏసీఎస్ డైరెక్టర్ బాకా సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ మండలంలో...

డుంబ్రిగుడ (అరకులోయ టౌన్): మండలంలోని కురిడి పంచాయతీ శరత్‌నగర్‌కు చెందిన టీడీపీ నేతలు శెట్టి ప్రసాద్, బీవీ సింహాచలం ఆధ్వర్యంలో ఆరు కుటుంబాలకు చెందిన వారు మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, గిరిజనాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. పార్టీ విజయానికి శాయశక్తులా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్, సర్పంచ్ వరబోయిరన లచ్చు, ఉప సర్పంచ్ వి.త్రినాథ్, జేసీఎస్ కన్వీనర్ గణపతి, పార్టీ ముఖ్య నాయకులు బాక సింహాచలం, చటారి కృష్ణారావు, పాపారావు, నగేష్, తుంనాథ్, మోహన్‌రావు, గృహసారదులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైర్‌లెస్ సిగ్నళ్ల పనితీరుపై పరిశీలన



అప్పరాజుపేట పోలింగ్ కేంద్రం వద్ద వైర్‌లెస్ సెట్ పనితీరును పరిశీలిస్తున్న అధికారి

రాజవొమ్మంగి: త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా సమాచార వ్యవస్థ కుంటుపడకుండా ఉండేలా సంబంధిత పోలీసు అధికారులు మన్య వ్యాప్తంగా వైర్‌లెస్ సిగ్నల్స్ ఏ విధంగా ఉన్నది పరిశీలిస్తున్నారు. వైర్‌లెస్ సెట్ చేత పట్టుకొని రాజవొమ్మంగి మండల వ్యాప్తంగా లోతట్టున గల పోలింగ్ కేంద్రాల పరిధిలో సిగ్నల్స్ స్థాయిని లేనిది సోమ, మంగళవారాల్లో కాకినాడ నుంచి వచ్చిన వైర్‌లెస్ నిపుణుల బృందం పరిశీలించింది. పోలింగ్ కేంద్రాల పరిధిలో సెల్ టవర్లు లేని చోట వైర్‌లెస్ సెట్స్ పనితీరుపై అధ్యయనం చేస్తున్నారు. కాగా రాజవొమ్మంగిలో పలు లోతట్టు గ్రామాల్లో వైర్‌లెస్ సెట్లు పని చేయడం లేదని, ఇందుకు మండలంలో దక్షిణ వైపు గల ఎత్తైన నాగుల కొండ పర్వత శ్రేణి ప్రతిబంధకంగా ఉందని పలువురు చెప్పారు. కాగా ఎన్నికల నేపథ్యంలో మారుమూల ప్రాంతాల నుంచి జిల్లాల హెడ్‌క్వార్టర్స్‌లోని ప్రధాన కార్యాలయాలకు సమాచారం చేరవేసేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే గ్రామ గ్రామానా ఏర్పాటు చేసిన సెల్‌టవర్ల పని తీరు మెరుగుపరచేందుకు కృషి జరుగుతోంది. మరో వైపు శాటిలైట్ ఫోన్ల పనితీరుపై కూడా అధికారులు దృష్టి సారిస్తున్నారు.

డీసీ X కేకేఆర్ నేడే బిగ్ ఫైట్



రింకూసింగ్

విశాఖ స్పోర్ట్స్: ఐపీఎల్‌లో భాగంగా మరో మ్యాచ్‌కు వైఎస్ రాజశేఖరరెడ్డి స్టేడియం సిద్ధమైంది. క్రికెట్ అభిమానులను అలరించేందుకు ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ బుధవారం బరిలోకి దిగుతున్నాయి. లక్ష్య ఛేదనతోనే ఆడిన రెండు మ్యాచ్‌ల్లో సాధించిన విజయాలకు కొనసాగింపుగా నైట్ రైడర్స్.. లక్ష్యాన్ని నిర్దేశించగా వచ్చిన విజయానికి కొనసాగింపుగా క్యాపిటల్స్ ఢీకొడుతున్నాయి. మంగళవారం రాత్రి ఇరు జట్లు వైఎస్సార్ స్టేడియంలో ప్రాక్టీస్ చేసి.. నేటి మ్యాచ్‌కు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకున్నాయి. బుధవారం రాత్రి 7.30 గంటలకు ప్రారంభమయ్యే మ్యాచ్‌కు జిల్లా యంత్రాంగం అంతా సిద్ధం చేసింది.



ప్రాక్టీస్ చేస్తున్న డీసీ ఆటగాళ్లు



శ్రేయస్ అయ్యర్





పిచ్ పరిశీలిస్తున్న గంగూలీ



కేకేఆర్ బ్యాటర్